కథానిక

# క్షుభితపథ యాత్ర

"మంజుశ్రీ"

గుబురు మామిడిచెట్టు మొదట్లో కూచుని అటు తిరిగి, "నేను ప్రేమించాను, హృదయం నిండుగా ప్రేమించాను" అంటున్నాడు రామనాథం. దాసు గలగల నవ్వేశాడు. మా స్నేహితులందరి మొహాల్లోనూ స్మితం తొణికింది. రామనాథం తల వెనక్కుతిప్పి "మీరంతా దుర్మార్గులు, మీకు దయా, జాలీ, ఆర్ద్రతా, ప్రేమా, ఏమీ లేవు. నేను చచ్చిపోవాలని చూస్తున్నారు. చచ్చిపోతే ఆనందిస్తారు, పోనీలే చచ్చిపోతాను, బ్రతికి ఏం బావుకునేట్టు!" అన్నాడు రామనాథం. దాసు తలదించేసుకున్నాడు. మా స్నేహితులందరి మొహాల్లో దైన్యం ప్రవేశించింది. నాకు అప్పటి రామనాథం స్థితిచూసి చాలా జాలేసింది. ఏడుస్తున్నాడు. ఏమీ అడగలేక పోయాను. వాణ్ణా స్థితిలో ఏమడిగేట్టు! ఎందుకలా అయిపోయినాడో తెలీదు. ఎవరికీ వాణ్ణి ఎలా పలకరించాలో తెలీలేదు. వాడి ముందుగానే నడచి వెళ్ళిపోయాం. శ్రావణమాసము కావటాన కాలవనిండా నీళ్ళున్నాయి. కాలవ రెండుగట్ల వెంబడి చామకూర బొద్దుగా పెరిగివుంది. ఇసుకలో అందరమూ కూలబడ్డాం. దూరాన వీరభద్రస్వామిగుడి మంటపాన్ని దట్టంగా అల్లుకొనిపోయిన గురివింద పొదలు అగపడుతున్నాయి. ఎంత ఉత్సాహంతోటి వచ్చామో, అంత ఉత్సాహమూ చచ్చిపోయింది. రామనాథం గురించి అందరమూ ఆలోచనలో వున్నామని అందరికీ తెలుసు. వాడిసంగతి ఎవరికి తెలీదు? అందువలన ఒకరిని వొకరం మాట్లాడించుకోవటానికి ఏమీ తోచటంలేదు. నా మనసు మనసులో లేదు. వచ్చేటప్పుడు నాలుగు కొట్లు తిరిగి తిరిగి, సిగరెట్లు మంచివి తెచ్చుకున్నాం. భోజనాలు చాలా ఆలస్యమైనవి. పెండ్లి పందిట్లో తమలపాకులుగూడా ముట్టలేదు మాకు. ఎవరి తొందరలో వాళ్ళున్నారు. రెండో బంతి, అలగా జనమంతా భోజనాలకు కూచుని వున్నారు. మమ్మలను అప్పుడు ఎవరు కనుక్కుంటారు. చల్లగా బయటపడ్డాం. వెధవ్వూరు చార్మినార్ సిగరెట్లుతప్ప యింకేమీ లేవు. నాలుగు కొట్లు తిరిగి సిజరుపాకెట్లు రెండు సంపాయించాడు దాసు. కాలవగట్టుకు వెళదామని బయలుదేరి యిలావస్తే, గుబురు మామిడిచెట్టుకింద రామనాథం కూచుని ఏడుస్తూ అవుపించాడు. అంతే. ఉత్సాహం నీరుగారిపోయింది. అల్లంతదూరాన ఆకుతోటలకు నీళ్ళు కడుతూ పాటలు పాడుతున్నారు. దాసులేచి వెళ్ళాడు. శేషు సిగరెట్ తీసిచ్చాడు. అగ్గిపెట్టె దాసుదగ్గరే వుంది. మాట్లాడకుండా కూచున్నాం. లేతవి నవనవలాడే తమలపాకులు పట్టుకొచ్చాడు దాసు. పై ఆకు మీద నీరుసున్నం వుంది. వక్కపొడి బయటకు తీశాడు. కూచుని మొత్తమాకులుఅయిపోయేదాకా నమిలాము. వీరభద్రస్వామిగుడి వెనకాల సూర్యుడు ఎఱ్ఱబడి క్రుంగిపోయాడు.

లేచి ఇంటివైపు నడిచాము. మామిడిచెట్టు కింద రామనాథం లేడు.

పెళ్ళిపందిరి గాసులైట్లతో కలకలాడుతున్నది. ముత్తయిదువలు కోలాహలం చేస్తున్నారు. ఒక పక్క మేజువాణీ జరిపిస్తున్నారు వేడుకగా. మేం నలుగురం బయట పందిట్లోనే కుర్చీల్లో కూర్చున్నాం.

దాసు అన్నాడు: రామనాథం అలా ఎందుకు మారిపోయాడంటావు?

ప్రేమ కథేమన్నానేమో? అన్నాను నేను.

అవునన్నాడు దాసు. శేషుమాట్లాడలేదు.

మధ్యాహ్నం రామనాథం వాళ్ళమ్మ భోజనాల దగ్గర కనపడ్డది గానీ, వాడగపడలేదు. ఆవిడ నడుగుదామనుకున్నాముగాని, ఆ తొందరలో అడగలేదు.

సాయంత్ర భోజనాలైపోయింతర్వాత రామనాథం కనిపించాడు. కాని పూర్వపు రామనాథం కాదు, నవ్వుతూ, పేలుతూ, జీవితం మొత్తం నందనవన సౌందర్యాలతో నింపుకొన గలననే ధీమాతో తిరుగుతుండే రామనాథానికీ యీ రామనాథానికీ పోలికేలేదు. ఆకారం కూడా పూర్తిగా మారిపోయింది. జుట్టంతా దుబ్బులాగే పెరిగిపోయింది. ఏ మూడు నెలలనుంచీ భోజనం లేని వానిలాగా కనపడ్డాడు, కళ్ళు లోతుకు పీక్కుపోయాయి.

పిన్నికూతురి పెళ్ళికి వల్లెకొచ్చాము. రామనాథానిది ఆ ఊరే కాబట్టి మాకేం పర్వాలేదు, హాయిగానే గడుస్తుంది లెమ్మనుకున్నాం. రాధ చురుకైనపిల్ల. శేషు మరదలు, దాసుకి వొదిన కాబోతున్నది. పెండ్లికొడుకు బాగా ఆస్తిపరుడట. చదువు ఏదో కొద్దిగావుంది. బాగానే వున్నాడు. దాసుకు పెదనాన్న కొడుకే.

ఆ యింట్లో బాగా స్వతంత్రమూ, పిన్నిదగ్గర చనువూ వున్నవాణ్ణి. ఆ పనీ ఈ పనీ కాస్త అందించాల్సిన భారంకూడా నా పైనపడ్డది. ముందు నన్ను విస్మయపరచిన విషయమేమిటంటే రాధ చాలా సంతోషంగావున్నట్లు కనపడకపోవటం. గాడిపొయ్యి తవ్విస్తూ కాఫీ తాగుతున్న నాకు కన్పించగానే, "ఏమిరాధా, పందెంకాస్తివే, వోడిపోయావ్" అన్నాను నేను పిన్నివచ్చి ఏమిటిరా ఆ పందెం అంది.

"రాధ తన పెళ్ళికంటే నా పెళ్ళి ముందంది. పందెం వేసుకున్నాము. రాధే వోడియింది" అన్నాను నేను.

రాధ ఏమీ మాటాడకుండా తలవంచుకు వెళ్ళిపోయింది. నాక్కాస్త చివుక్కుమనిపించింది మనసు. పిన్నిని అడుగుదామనుకున్నాను. అక్కణ్ణుంచి పిన్నేదోపనిమీద వెళ్ళిపోయింది. మర్రోజు దాసూ శేషూ వచ్చారు. వాళ్ళతోటే తేలిపోయింది నాపనంతా.

ముత్తైదువులు లేచింతర్వాత మళ్ళీ యింట్లోకి పిలిచారు మమ్మిలను. ఎవరికీ భోజనాలు అవసరం లేదని కాస్త మజ్జిగతాగి మిద్దెపైకి ఎక్కాము. మట్టిమిద్దెలు. కాస్త బాగచేసుకొని పండుకొని బాతాఖానీ వేసుకున్నాము.

రామనాథం అలా అయిపోయాడంటే నాకు చాలా విచారమేసింది. రామనాథం నాకు బాల్య స్నేహితుడు. పైన అప్పుడప్పుడు పిన్నిగారివూరు వచ్చినప్పుడు స్నేహంచాలా వృద్ధినొందేది. రామనాథానికి వాళ్ళమ్మతప్ప ఎవరూలేరు. ఆస్తికూడా ఎక్కువలేదు. బి. ఎ. తప్పిపోయాడు. పంచాయతీ బోర్డులో క్లర్కుగాచేస్తూ వున్న పొలం పుట్రా చూసుకుంటూ వూళ్ళోనే వుండిపోయాడు. అటువంటి రామనాథం, వాడితల్లి ఆశలన్నీ కేంద్రీకరింపబడిన రామనాథం, పిచ్చెక్కినవాడిలాగా, పిచ్చెక్కిపోయి, ఇలా అయిపోవటం చాలా బాధనిపించింది. వాళ్ళమ్మను అన్నిసంగతులూ కనుక్కోవాలనుకున్నాను.

తెల్ల తెల్లవారుతుండగా ఎద్దుబండ్లు కట్టుకొని పెళ్ళివాళ్ళు వెళ్ళిపోయారు. మధుపర్కాల్లోరాధ చూడటానికి ముచ్చటగావుంది. కాని అందరు పెళ్ళికూతుళ్ళూ, పుట్టిళ్ళు వదలి వెళ్ళేటప్పుడు కళ్ళనీళ్లు పెట్టుకోవడం సహజం. రాధ బొవురుమంది తల్లిని కౌగలించుకొని. అక్కయ్య అరిచింది. పెళ్ళివాళ్ళంతా వెళ్ళిపోయారు. రాధవెంట అక్కయ్య వెళ్ళింది.

పిన్ని నన్ను నాలుగురోజులుండి లెఖ్ఖాడొక్కా చూసిపెట్టిపోరా అంది. కాదనలేకపోయాను. దాసూ శేషూ వెళ్ళిపోయారు. ఇంటినిండా కర్జూరపుకాయల వాసనా, తమలపాకుల వాసనా, వాడిపోయిన చామంతిపూలవాసనా తప్ప యింకేమీలేదు. సాయంత్రంపూట రామనాథం వాళ్ళింటికెళ్ళాను. వాడింట్లోలేడు. వాళ్ళ అమ్మ ఆప్యాయంగా పలుకరించింది. మాటలో గాద్గద్యం ప్రస్ఫుటమైంది. కాసేపు మౌనంగావుండి "ఎందుకిలా మారిపోయాడు" అన్నాను.

మాతృహృదయం ఘోషిల్లింది. కళ్ళనీళ్ళు పెట్టుకొని "ఖర్మ" అన్నది. అలాంటి సమయాల్లో సంభాషణ నడపటం స్వతహాగా నా కసలు చేతకాదు. కళ్ళనీళ్ళుచూస్తే నేను అడగదల్చుకుందీ, చెప్పదల్చుకుందీ కూడా పెకలిరాదు.

"ఏమిటైంది?" అన్నాను నేను,

"మారిపోయాడు. ఏమిటో చెప్పడు. అన్నం నీళ్ళూ లేకుండా అలమటించి పోతున్నాడు.

ఎప్పుడూ ఏదో ఆలోచనే, ఆడదాన్ని నేనేం చేయగలను చెప్పునాయనా"? అంది ఆమె.

"ఏమిటన్నా మెదడుకుసంబంధించినజబ్బేమో" అన్నాను.

"జబ్బూకాదూ, పాడూ కాదు నాయనా, అంతా ఖర్మ. అంతకుతప్ప మరేంలేదు!" అంది ఆమె.

నాకేమీ అర్థంకావటంలేదు. అసలు సంగతి తెలుసుకోలేక పోతున్నాను.

"ఎన్నాళ్ళనుంచి?" అన్నాను నేను.

"ఏమనుకోబోకు బాబు, అయిపోయిందిగా చెప్పేస్తాను. అర్హత వున్నా లేకపోయినా ఆశలను చంపుకోలేరు మనుషులు. రాధ నా కోడలై వుంటే రాముడు సుఖపడేవాడు" అంది ఆమె.

నాకంతా తెలిసీ తెలియనట్టుగా వుంది. బరువుగా ఆలోచించుకుంటూ, లేచివస్తానంటూ వచ్చేశాను. ఇంటి కొస్తుంటే దారిలో మఱ్ఱిచెట్టుకింద రామనాథం కూచోని వున్నాడు. మాట్లాడిద్దామనుకున్నానుగాని, మాట్లాడించే ధైర్యం లేకపోయింది నాకు. నన్నుచూసీ చూడనట్లుగా. నిర్లిప్తతతో వుండిపోయాడు రామనాథం.

భోజనం చేస్తుండగా పిన్నే ఎత్తుకుంది, ఎలా యీ సంగతి బయటకు రప్పిద్దామా అని ఆలోచిస్తుంటే. "నా బరువు యీనాటితో తీరిపోయింది. ఆడపిల్లల పెళ్ళిళ్లంటే సామాన్యంగా వున్నాయిరా యీరోజుల్లో, ఎంత కష్టం, ఎంత కష్టం రాధ అదృష్టం బాగుంది, మంచివాడే దొరికాడు. లంకంత కొంపలు, నాలుగరకల వ్యవసాయమట. మాగాణీ వుందట, తల్లీ తండ్రీ వున్నారు" పిన్ని చెప్పుకపోతున్నది.

"రాధ కుఱ్ఱాణ్ణి ముందుచూసిందా, సంతోషంగా వున్నట్లుందా?" అడిగాను.

"దానికేం తెలుసురా, చిన్నసన్నాసి, లోకాన్నెరుగదు. సుఖపడటంకూడా తెలీదు. రోజులు గడిస్తే వాళ్ళే బాగుంటారు. ఓకాయ కాస్తే యిక ఏపేచీలు వుండవు," అంది పిన్ని.

"ఇప్పుడు రాధ కిష్టంలేదేమిటి?"

"దానిష్టంతోటేమిటి, పిల్లదాని సుఖం మనకంటే దానికి తెలుసునా.? ఇప్పుడు యిష్టమదే కలుగుతుంది. దాని అదృష్టమది.

పిన్నిమాట్లాడే తీరుచూస్తే నాకు విసుగు పుట్టింది. వీళ్ళకు హృదయాలు గుర్తించటం చేతకాదు. ఎంతసేపటికీ డబ్బూ దస్కం, ఇల్లూ వాకిలీ చూస్తారుగాని, ప్రేమానురాగాలతోటి వీళ్ళకు పనిలేదు. అందచందాలుకూడా అవసరంలేదు వీళ్ళకి పైన, దాని అదృష్టం, అదృష్టమంటూ పొంగిపోతున్నది పిన్ని, వీళ్ళకు దేవుడు వొకరి నర్థంచేసుకునే తెలివితేటల నియ్యలేదు. తన కూతురు ఎలా సుఖపడుతుంది అనేవిషయాన్ని వియ్యపురాలి వొంటిమీద బంగారం ఖరీదుతోటి కొలిచింది పిన్ని.

"ఈ సంబంధమే కుదరపోయినట్లయితే పూటకు ఠికాణాలేని ఆ సుబ్బమ్మ కోడలు కావలసివచ్చేది. రాధ," అంది పిన్ని.

నిజంగా చూస్తే పిన్నికి గూడా వాళ్ళకంటే ఎక్కువ ఆస్తేమీలేదు. ఆయన పోతూ పోతూ, వోఘదకరాలు సంపాదించి యిచ్చి పోయాడు. పెద్దకూతురి పెళ్ళికి రెండువేల అప్పయింది. అక్కయ్యను బస్తీసంబంధమే యిచ్చారు. రాధ స్కూలుఫైనలుదాకా అక్కయ్య దగ్గరేవుండి చదువుకుంది. నేననుకున్నాను 'రాధయింత బలహీనురాలు' ఏమాఅని. గట్టిగా తను చెప్పేస్తే పిన్ని ఒప్పుకోక ఏంచేసేది. కాకపోతే, అవసరమైతే ఎంత మొండికెత్తైనా దిగాల్సిందే.

"ఏం, రామనాథానికిద్దామనుకున్నారేమిటి?"

"అవునురా, సుబ్బమ్మా, మూడు నాలుగు సార్లు యింటికొచ్చి అడిగింది. రాధకు యిష్టమే, నేనూ అనుకున్నాను, ఏదోవున్న ఊళ్ళో ఉంటారు కదా అని. కాని పెద్దమ్మాయి చెప్పిందాకా నాకు తెలీలేదు,"

నాకిప్పుడు అర్థమైంది. అమ్మా అక్కా ఇద్దరూకలిసి రాధను లొంగదీసి వుంటారు. రాధ ఒప్పుకోకుండా వుండాల్సిందసలు. కాని వీళ్ళిద్దరూ కలసి వొప్పించి ఉంటారు. పాపం ఎలా అయితేనేం, రాధమనసు బాధపడటానికి దోహదంచేశారు.

"ఏంపిన్నీ, అయితే అక్కయ్య వెలికిందా యీ సంబంధం. అవును అదే చెప్పింది. లగ్గాలు పెట్టుకోలేదుగాని. లేకపోతే రామనాథానికిద్దామనే అనుకుంది. ఇంతకూ అదృష్టాన్ని తప్పించుకోలేరు."

నేనికేమి మాట్లాడలేదు. చెయి కడుక్కొని

లేచాను, పడమటింట్లో వక్కపొడి తీసుకుంటుండే గూట్లో రాధపుస్తకాలు కన్పించినయి. నాకెందుకో ఒక ఆలోచన తట్టింది. రాధ పుస్తకాలన్నీ ముందుపడేసుకున్ని తిప్పాను. ఏమైనా ఉత్తరాలు అగుపడతా యేమోనని నా అభిప్రాయం. ఎట్టట్ట బౌండు పుస్తకంలో ఓ ఉత్తరం తెల్లకాగితం మీద శుభ్రంగారాసివున్నది అవపడ్డది, తీసిచదివాను.

రాధకు,

నేను నీవనుకునేటంత పశువునుగాను. నాకూ చదువూ సంస్కారమూ వున్నవి. డబ్బులేదు. అదేగానీవనేది? నిజమే. అదేవుంటే నిన్ను పొందగలిగేవాణ్ణి. ఇప్పటికైనా మించిపోయిందేమీలేదు. ఆలోచించు. తొలేకాసినాడు, దీపారాధన చేయటానికి వచ్చినప్పుడు వీరభద్రస్వామి గుళ్లో చూపుల్తో మాట్లాడుకున్న పవిత్రమైవ భాషలోని భావం గుర్తుచేసుకో.

నిన్ను యీ మాటలను ముఖాముఖి అడిగినందుకేగా నన్ను పశువుకింద జమకట్టావు. రాధా, నీకు హృదయంలేదు. నీవల్ల మా అమ్మ ఎంతో బాధపడుతుంది. ఆవిడ బ్రతికివున్నంతవరకూ నాకేం ప్రేమలేదన్నావు కదూ? అవును వుండదు. తరచి తరచి నీ హృదయంలో బాధ రేకెత్తించాలని లేదు. జీవితంలో నేను పొందదగింది ఏమీలేదు. చాలా దగాపడ్డాను.

నీ సౌఖ్యాన్ని ఆకాంక్షిస్తూ, కళ్ళనీళ్ళతో
రామనాథం.

రెండురోజులుపోయాక రామనాథం కనపడ్డాడు గొణుక్కుంటూ. తరువాత ఊరికొచ్చేశాను.

---

స్కెచ్

# విచ్ఛిన్న భ్రాంతి

"భరణి"

"నిన్ను ప్రేమిస్తున్నాను లలితా!" అన్నాడు మూర్తి.

ఆ మాట వినగానే లలిత హృదయం ఒక్కసారిగా కంపించిపోయింది. బెదురు చూపులు చూచింది. ఇదేమాట యిప్పటికి యిద్దరు! యితను మూడోవాడు. లలిత దురదృష్టమో ఏమోగాని లలితను చూడగానే ఆకర్షిస్తారు.

ప్రేమోన్మాదంలో పడ్డవాడు ప్రపంచమంతా ప్రేమమయం అనుకుంటాడు. ఆ మత్తులో ఇతరుల విషయం ఆలోచించడు. తను ప్రేమిస్తున్నాడు. వాళ్లుగూడా ప్రేమిస్తున్నారు అనుకుంటాడు. మూర్తి యీ పరిస్థితిలోవున్నాడు. ఎప్పటినుంచో అనుకుంటున్నాడు. అడుగుదామని కాని లలిత మౌనానికి భయపడి యింతకాలం ఆగాడు. ఇక నిరీక్షించలేక అడిగేశాడు. తప్పక అంగీకరిస్తుందనుకున్నాడు. ఎందు కంగీకరించదు? తనకేమి తక్కువైనదని!

"మిమ్మల్ని చూసినప్పుడెప్పుడూ నాకా అభిప్రాయం కలగలేదు. క్షమించండి!" అంది మాటలకు తడబడుతూ నెమ్మదిగా లలిత.

మూర్తి నమ్మలేకపోయాడు. ఏమిటీ! లలితేనా మాట్లాడేది! తల తిరిగినంత పనైంది అతనికి.

"లలితా నువ్వేనా...?" అన్నాడు సగంలో ఆపి.

"నిజమే" అంది నెమ్మదిగా.

ఎవ్వరూ కదల్లేదు. కొంచెంసేపు నిశ్శబ్దం మూలిగిందా గదిలో. లోపలికి వస్తున్న చల్లగాలి కూడా లోపలికి రావడానికి భయపడిందాఅన్నట్లు తప్పుకునిపోయింది.

మూర్తికి తెలుసు యింతకుముందు యిద్దరికీ యిలాగే అయిందని. కాని ఆ మోహంలో తనూ అడిగితే ... అనుకున్నాడు. కాని ఫలితం వేరే అయింది. నిరాశ నిస్పృహ కలిగినయ్. కాని దాని వెంటనే అదోకమాదిరి అసూయలా ద్వేషం కోపం వచ్చింది. ఇలా యింత కచ్చితంగా అందరినీ వ్యతిరేకించటానికి కారణమేమిటి? అందరూ వాళ్ళంతట వాళ్ళే వస్తున్నారనా? ఎదురు ప్రశ్నలేసి సవాల్ చేయాలనిపించింది.

"అయితే మీరు ప్రేమను ప్రేమ వివాహాన్ని నిరసిస్తారా? లేక వివాహం చేసుకుంటేగాని ప్రేమించరనుకుంటాను" అన్నాడు.